


సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

రైతులకు సాగును ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తపేట నియోజక వర్గ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు ఆయన బుధవారం మండలంలోని వసంతవాడ ఎత్తిపోతల పథకం మర మత్తులు పూర్తవడంతో ఆ పథకాన్ని ఆయన ప్రారంభించారు ఈ పథకం మరమ్మత్తులు గురవడంతో రైతులకు సాగులో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో యుద్ధ ప్రాతిపదికన రూ.21.25లక్షలతో మరమ్మతులు చేసి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేశారు.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడి

అధికార పార్టీలో అలజడి

- గ్రూపుల పోరుతో వైసిపి ఉక్కిరిబిక్కిరి
- ఆత్మీయ సమావేశాలతో బహిర్గతమవుతున్న విభేదాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నాయకుల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఒక్కొక్కటిగా బయపడుతున్నాయి. ముఖ్య నేతల కలహాలు అధిష్టానాన్ని కంగారు పెడుతున్నాయి. ఒక్కో నియోజకవర్గంలోనూ బయటపడుతున్న విభేదాలతో వైసిపి తల్లడిల్లుతోంది. ఎన్నికల ముంగిట ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయోనన్న చర్చ సాగుతోంది. కీలక నేతలే కలహానికి దిగడం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. జిల్లాకు చెందిన మంత్రుల నుంచి వివిధ నియోజకవర్గాల ఎంఎల్ఎలు, ఎంపీల వరకు అందరికీ ఇలాంటి పరిస్థితే ఉండటంతో ఏ మేరకు సర్దుబాటు చేయగలరన్నది సందేహంగా కనిపిస్తుంది.

మంత్రులకు ముప్పు తిప్పలే


మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు అసమ్మతి సెగ తప్పడం లేదు. గత ఎన్నికల్లో ఆయనకు అండగా నిలిచిన సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ నుంచి ఇప్పుడు అడ్డంకులు ఎదురవుతున్నాయి. బోస్ అనుకూల గ్రూపు రామచంద్రపురంలో వేణుని స్థానికేతరుడంటూ అభ్యంతరం పెడుతోంది. 2019లో మధ్యం పలికిన నాయకులే ఈసారి వేణుకి టికెట్ ఇవ్వడానికి వీలు లేదంటున్నారు. ఎంపీ బోసు కుమారుడు సూర్యప్రకాష్ పేరును వారు తెరపైకి తెస్తున్నారు. బోస్ అనుకూల గ్రూపు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యాననే ఆక్రోశంతో మంత్రి వేణు అనుచరులు రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్ శివాజీపై రెండు రోజుల క్రితం దాడి చేయడంతో గ్రూపుల పోరు తారా స్థాయికి చేరింది. ఇది జీర్ణించుకోలేక శివాజీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి నుంచి గతంలో ప్రాతినిధ్యం వహించిన ప్రస్తుత ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు గ్రూపు కూడా ఈ పరిణామాలను అనుకూలంగా మలుచుకునే యత్నంలో ఉంది.

కాకినాడ జిల్లాలోనూ ఇదే తంతు

కాకినాడ జిల్లా నుంచి మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజాకి, జిల్లాలో కీలక నేతగా ఉన్న కాకినాడ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందనే ప్రచారం జరుగుతోంది. ఇరువురి నేతలూ పెత్తనం కోసం పోటీపడుతున్నారు. కాకినాడ నగరంలో నిర్వహించే పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు మంత్రి రాజా దూరంగా ఉంటున్నారు. ద్వారంపూడి తీరుపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోంది. జిల్లాలోని అన్నిచోట్లా ద్వారంపూడి హవా కొనసాగుతుండడం మంత్రి రాజాకు గిట్టడం



లేదంటున్నారు. ద్వారంపూడి దూకుడుని విపక్షాలతో పాటు అధికార పార్టీలో మరికొందరు నాయకులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారని సమాచారం. మాజీ మంత్రి కన్నబాబు, ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత ప్రసాద్ వంటి వారికి కూడా ద్వారంపూడితో సానుకూల సంబంధాలు లేవనే ప్రచారం ఉంది. జగ్గంపేటలో సిట్టింగ్ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, మాజీ మంత్రి తోట నరసింహం మధ్య విభేదాలు రాజుకుంటున్నాయి. నరసింహం తన కుమారుడు రామ్‌జీకి కొంతకాలంగా నియోజకవర్గంలో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ అనుచరగణానికి జగ్గంపేట నుంచి ఈసారి పోటీలో ఉంటామనే సంకేతాలు ఇస్తున్నారు. ఈ వ్యవహారం ఎంఎల్‌ఎ చంటిబాబు, ఆయన అనుచరులకు మింగుడు పడడం లేదు. ప్రస్తుతం ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అటు ప్రత్తిపాడు నియోజకవర్గంలోనూ లుకలుకలు వినిపిస్తున్నాయి. ఎంఎల్ఎ



మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం

పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ

పర్వత ప్రసాద్‌పై సొంత పార్టీ నేతలే తీవ్ర అసంతృప్తితో ఉండగా బహిరంగంగానే ఎంఎల్‌ఎపై విమర్శలు గుప్పిస్తున్నారు. పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీత మధ్య అంతర్గత పోరు నడుస్తోంది. మరోసారి వంగా గీత పిఠాపురం టిక్కెట్ ఆశిస్తుండగా పార్టీ అధిష్టానం నుంచి కష్టపడిన తనకే మళ్లీ సీటు ఖాయమని సిట్టింగ్ ఎంఎల్ఎ దొరబాబు ప్రచారం చేసుకుంటున్నారు.

రాజమహేంద్రవరంలోనూ రాజుకుంటోంది

రాజమహేంద్రవరం నగర రాజకీయాలు కూడా అధికార పార్టీ గ్రూపు పోరుకు వేదికగా ఉన్నాయి. ఒక వైపు బిడిపి మరోసారి పాగా వేయాలని పావులు కదుపుతున్న చోట అధికార వైసిపి నాయకుల మధ్య కలహాలు కాక రేపుతున్నాయి. ఏకంగా ఎంపీ మార్గాని భరత్ అనుచరుడిని రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సోదరుడు బెదిరించినట్టు సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. భరత్ వర్సెస్ జక్కంపూడి ప్యానెల్ అన్నట్లుగా మారిన తరుణంలో స్వయంగా సిఎం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. దాని ప్రభావం కొంతకాలమే కనిపించింది. ఇప్పుడు మళ్లీ కథ మొదటికి వచ్చింది. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీలో విభేదాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సిట్టింగ్ ఎంఎల్‌ఎలకు వ్యతిరేకంగా చాలా చోట్ల ద్వితీయ శ్రేణి నాయకులు పావులు కదుపుతున్నారు. గ్రూపులుగా మారి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవహారాలపై అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందోనన్న చర్చ జరుగుతోంది.



జగ్గంపేట

జ్యోతుల చంటిబాబు, ఎంఎల్ఎ

తోట నరసింహం, మాజీ ఎంపీ

రాజమండ్రి

జక్కంపూడి రాజా, ఎంఎల్ఎ

మార్గాని భరత్‌రామ్, ఎంపీ

కాకినాడ

ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి,ఎంఎల్ఎ

దాడిశెట్టి రాజా, మంత్రి

ఆగస్టు 15 తర్వాత తుది నిర్ణయం

వైసిపిలో విభేదాలపై మాట్లాడిన ఎంపీ బోస్

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఇటీవల రామచంద్రాపురం నియోజకవర్గంలో వేగంగా మార్పు జరుగుతున్న పరిణామాలపై రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ 'ప్రజాశక్తి' దినపత్రికతో బుధవారం మాట్లాడారు. రామచంద్రాపురం నియోజ కవర్గం లోని ఒకే పార్టీలో కొనసాగుతున్న మంత్రి వేణుపై ఆయన చేస్తున్న కార్యక్రమాలు, పాల్పడుతున్న అవినీతిపై ఎప్పటి కప్పుడు పార్టీ అధినాయకుని దృష్టికి తీసుకువెళ్లినా అధిష్టానం మంత్రి వేణుపై సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో, రాజ్య సభ ఎంపీ బోస్ వైసిపి నుండి బయటకు వస్తారని పలువురు వ్యాఖ్యా నిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రజా శక్తి' ఆయనతో మాట్లాడింది. ఈ విషయమై ఎంపీ బోస్ మాట్లాడుతూ తన వద్దనున్న సమాచారం అంతా పార్టీకి వివరించానని అన్నారు. పార్టీ పట్ల, ఓటర్ల పట్ల, సీనియర్ నాయకుల పట్ల గౌరవం లేని మంత్రి వేణు పై అధిష్టానం చర్యలు చేపట్టకపోతే ఆగస్టు 15 తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఎంపీ బోస్ వివరించారు.



పిల్లి సుభాష్‌చంద్రబోస్

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

గోదావరి నది ఎగువ పరివాహకప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద వరద నీరు భారీగా చేరుతోందని రాబోయే 3 రోజుల్లో సుమారు 5, లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం వరద ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుందనిజిల్లా గోదావరి తీర ప్రాంత ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలన్నార. జిల్లా యంత్రాంగం వరద హెచ్చరికలు ఎప్పటి కప్పుడు తెలియజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంప్రదించాల్సిన నెంబర్లు ఆలమూరు, కపిలేశ్వర పురం మండలాలు ఎన్.డేవిడ్ రాజు ఫోన్. 9948029350, ఎన్ నవ్య ఫోన్.9866443065, కె.గంగవరం మండలం ఎన్ డేవిడ్ రాజు ఫోన్. 9948029350, నాయుడు దిలీప్ తేజ ఫోన్ 9441604624, పి.గన్నవరం మండలం పిడికె.ప్రసాద్, ఫోన్. 7095687724, జిజి.బాబూజీ ఫోన్. 494957498 లో సంప్రదించాలని ఆయన సూచించారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 18004252532, ధవలేశ్వరం కంట్రోల్ రూమ్ నెంబర్ 0883 2417066



కోటిపల్లి వద్ద పెరగుతున్న వరద గోదావరి

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురంలో బంగారం, వెండి ,వస్తువులు చోరీకి గురైన బాధిత కుటుంబ సభ్యులు గరగపాటి వెంకట్రావు, సూర్య కుమారి దంపతులను బుధవారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పరామర్శించారు. రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్, అంగర ఎస్ఐ జి చంటి తో కలిసి ఆయన బాధిత కుటుంబ సభ్యుల నుంచి చోరీ జరిగిన తీరును, వివరాలను అడిగి తెలుసుకున్నారు. చోరీ జరిగిన వస్తువులను బాధితులకు వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఆగస్టు 15 నుంచి నగదు రహిత లావాదేవీలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఇక నుంచి గ్రామ పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారిణి వి.కృష్ణకుమారి తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి నగదు రహిత లావాదేవిలు నిర్వహణకు పంచాయతీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బుధవారం జిల్లాలోని డివిజనల్ పంచాయతీ అధికారులు, విస్తరణాధికారులు , పంచాయతీ కార్యదర్శులతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో నగదు రహిత లావాదేవీలు నిర్వహించవలసినదిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులు అన్ని గ్రామ పంచాయతీల్లో అమలు చేయాలని సూచించారు. నగదు రహిత లావాదేవీలకు సంబంధించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-యంత్రాంగం


జిల్లాలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని లబ్ధిదా రులకు ధృవపత్రాలు అందజేశారు. ఈ వారు మాట్లాడతూ జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. **రామచంద్రపురం**సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ అన్నారు.బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలోని హౌసింగ్ బోర్డ్ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో మంత్రి పాల్గొనీ ప్రసంగించారు. కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, తాసిల్దార్, తేజేశ్వరరావు స్థానిక ప్రజాప్రతినిధులు ,లబ్ధిదారులు పాల్గొన్నారు.**మామిడికుదురు** అప్పనపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మహాలక్ష్మి, ఎంపిటిసి సభ్యురాలు బొంతు నీలిమ, కటకం శెట్టి ఆదిత్య, జక్కంపూడి వాసు గడ్డం కష్ణమూర్తి, తులా గోపాలకష్ణ, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ కారుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. బుధవారం కపిలేశ్వరపురం మండలం మాచరలో గ్రామ సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిసభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు శీలం సూర్యకుమారి, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** అర్హత లక్ష్యంగా లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాల ధ్రువపత్రాలను అందిస్తున్నామని ఎంపిడిఒ కె.జాన్‌లింకన్, తహశీల్దార్ ఐ.పి.శెట్టి అన్నారు. పెనికేరు, మూలస్థానంలలో సర్పంచులు వనుం చిన్నావతి జార్జిబాబు, వరప్రసాద్ ల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధృపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఇలు పోసమ్మ, డి.శ్రీనివాస్, డిటిలు జానకి రామయ్య, జానకి రాఘవ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.**అమలాపురం రూరల్** సమనస గ్రామ సచివాలయంలో సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కరికాల భక్త సేవా సంఘం డైరెక్టర్ కరేళ్ల రమేష్ బాబు, అమలాపురం మండల కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్వర్గన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలోమాట్లాడుతున్నమంత్రివేణు



అప్పనపల్లిలో లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు



పెనికేరులో జగనన్న సురక్షలో పాల్గొన్న ఎంపిడిఒ జాన్‌లింకన్ తదితరులు



బస్ పాస్‌లు అందుకున్న విద్యార్థులతో దుర్గారాణి

బస్‌పాసుల అందజేత

ప్రజాశక్తి-మండపేట


పట్టణంలోని జెడ్‌పి బాలికోన్నత పాఠశాల, వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఉచితంగా బస్ పాసులు బుధవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించడంలో భాగంగా ఉచితంగా బస్ పాస్ లు అందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు మందేశ్వరరావు, ఆర్.నాగకుమార్, పాఠశాల సిబ్బంది, రామచంద్రపురం డిపో ఉద్యోగులు కుమార్, సూరిబాబు పాల్గొన్నారు.

సంతోష్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న వాడపాలెం గ్రామానికి చెందిన బండారు సంతోష్‌ను కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్సమా బాబు, మాజీ సర్పంచ్ బండారు బుల్లి తాతా, నీటి సంఘ మాజీ చైర్మన్ బండారు వీరబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వాళ్లు.. పాఠ్యాంశాలని మార్చేశారు.. వీళ్లు వ్యవస్థనే మార్చేశారు.. కానీ మన దుర్గతి మాత్రం మార్చట్లేదురా...!!!



పి.గన్నవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఆరో ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-మామిడికుదురు(పి.గన్నవరం)

రోగులకు మెరుగైన సేవలందించేందుకు వైద్యసిబ్బంది కృషి చేయాలని, ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దష్టి సారించాలని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నూతనంగా కొనుగోలు చేసిన బయో కెమికల్ ఎనలైజర్ మరియు ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సమాఖ్య అధ్యక్షులు తోలేటి బంగారు నాయుడు, నక్కా చిన్న వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లేఖర్ల సంఘ అధ్యక్షునిగా రామమోహనరెడ్డి

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం రిజిస్ట్రేషన్ ఆఫీస్ పరిధిలో బుధవారం దస్తావేజు లేఖర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా రావులపాలెంకు చెందిన కొవ్వూరి రామమోహనరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా యలమర్తి సుబ్బారావు, సెక్రటరీ గా ద్వారంపూడి అప్పారెడ్డి, ట్రెజరర్ గా పెచ్చెట్టి రాజశేఖర్ లను ఎన్నుకున్నారు. రామ మోహన రెడ్డిని సబ్ రిజిస్ట్రార్ రేవంత్, ఆఫీస్ సిబ్బంది, లేఖర్ల సంఘ సభ్యులు తదితరులు అభినందించారు.

నేటి నుంచి విఆర్‌ఎల దీక్షలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి ప్రభువం తమ సమస్యలను పరిష్కరించ నందున రాష్ట్ర విఆర్ఎ ల సంఘం పిలుపు మేరకు రిలే దీక్షలు చేపడుతున్నట్టు విఆర్ఎ ల సంఘం మండల అధ్యక్షుడు ఉందుర్తి అంజలరావు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న దీక్షల విషయమై డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం తహశీల్దార్ జె. వెంకటేశ్వరి కి అందజేశారు. జూలై 20,21 న మండల కేంద్రాల వద్ద ఆగస్టు 7,8 న కలెక్టరేట్ ల వద్ద 23,24 న విజయ వాడలో రాష్ట్ర స్థాయి దీక్షలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిం చామని, 24న జగనన్నకు చెబుదాం ఛలో విజయవాడ కార్యక్ర మాన్ని చేపడతామన్నారు. విఆర్ఎలు నేదునూరిపట్టాభిఃరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

ప్రజాశక్తి-అమలాపురం

ఓటర్ల జాబితా సవరణలో చేర్పులు, మార్పులకు సంబంధించిన డేటా పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు లతో సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి ప్రత్యేక ఓటర్ జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ విధివిధానాలను వివ రించారు. ఆయన మాట్లాడుతూ జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు జరిగే ఇంటింటి సర్వేలో రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ తమ పార్టీలు తరపున బూత్ స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి సర్వే ప్రక్రియలో భాగ స్వామ్యం వహించినట్లయితే ఓటర్ జాబితా మరింత ఖచ్చితత్వంతో ఉండేందుకు దోహదపడుతుందన్నారు కార్యక్రమంలో డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర రావు, భారతీయ జనతా పార్టీ తరపున విళ్ళ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనా సదస్సులు

అంబాజీపేట అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కొత్తపేట ఆర్‌డిఒ ఎమ్.ముక్కంటి అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో తహసిల్దార్ టి.మంగాతాయారు అధ్యక్షతన బిఎల్ఒలు, విఆర్ఒలు తదితరులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 21 నుంచి నెల రోజులపాటు ఇంటింటా సర్వేలో ఓటర్ల జాబితా సవరణలో చేర్పులు, మార్పులకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఎలక్షన్ డ్యూటీ అధికారి బి. గోపాలకష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **ఆలమూరు** 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని మండల అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహశీల్దార్ ఐ.పి.శెట్టి అన్నారు. బుధవారం ఆయన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎలక్షన్ సూపర్వైజర్లకు, 62 బూత్ లెవల్ అధికారులకు కలిపి ఓటు గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో విఆర్ఒలు సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు. **అయినవిల్లి** మండల కార్యాలయంలో తహశీల్దార్ నాగలక్ష్మమ్మ అధ్యక్షతన బుధవారం ఓటర్ల నమోదు కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారి ఆచార్యులు, డీటీ అశోక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

22న వాహనాలకు వేలం

ప్రజాశక్తి-కొత్తపేట

సారా కేసుల్లో పట్టుబడిన 6 వాహనాలకు జూలై22న కొత్తపేట ఎస్ఇబి స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తారని ఎస్ఇబి సి ఐ మద్దాల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు వేలం నిర్వహించబడును. వివరాల కొరకు కొత్తపేట ఎస్ఇబి స్టేషన్ నందు సంప్రదించాలన్నారు.

కంప్యూటర్ ప్రింటర్ అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం ఎంపీ చింతా అనురాధ ప్రత్యేక చొరవ తీసుకుని ఒఎన్‌జిసి వారితో మాట్లాడి రూ.4 లక్షల సిఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ లను ప్రింటర్లను ఏర్పాటు చేయించారు. ఈ కంప్యూటర్ ప్రింటర్లను బుధవారం అల్లవరం మండలం మొగళ్లమూరులోని ఎంపీ క్యాంపు కార్యాల యంలో అల్లవరం మండల తహశీల్దార్ కార్యాలయానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి, ఎంపిపి ఇళ్ల శేషారావు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ మోనిటర్స్ బహూకరణ

ఆలమూరు స్థానిక రెవెన్యూ కార్యాలయానికి మండల కేంద్రానికి చెందిన పారిశ్రామికవేత్త, దాత వంటిపల్లి పాపారావు కంప్యూటర్ మోనిటర్లను బుధవారం తహశీల్దార్ ఐ.పీ.శెట్టికి అందజేశారు. ఇటీవల పాపారావు కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో రెవెన్యూ అధికారులు కార్యాలయంలో కంప్యూటర్స్ తరచు మరమ్మతులకు గురై పనులు జరగడం లేదని వారన్నారు. దీనికి మోనిటర్స్ సక్రమంగా పనిచేయకపోవడమే కారణంగా సిబ్బంది ఇబ్బందులను గుర్తించారు. దీంతో స్పందించిన వంటిపల్లి పాపారావు 2 మోనిటర్స్‌ను కొనుగోలు చేసి వాటిని అందించారు.

చెస్ పోటీల్లో 'మోడరన్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

అమలాపురంలో ఎస్‌కెబిఆర్ కళాశాల్లో ఈ నెల17న జరిగిన అండర్ -19 చెస్‌పోటీల్లో మోడరన్ స్కూల్ విద్యార్థి ప్రతిభ చూపాడు. ఇక్కడ హైస్కూల్ నందు టెన్త్ చదువుతున్న దంగేటి గిరి మణిశేఖర్ జిల్లాస్థాయి ద్వితీయ స్థానంతో సత్తా చాటాడు. మణి శేఖర్‌ని 'మోడరన్' అధినేత లయన్ జివి. రావు, అకడమిక్ డైరెక్టర్స్ ఎ.రమాదేవి, ఆర్.ఉమాదేవి, హెచ్ఎం ఎం.చిట్టిబాబు, స్టాఫ్ అభినందించారు. జి వి.రావు మాట్లాడుతూ మణిశేఖర్ భీమవరంలో జరిగే స్టేట్ లెవెల్ పోటీలకు అర్హత సాధించాడన్నారు.

మడికి మార్కెట్ సమయాల్లో మార్పు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మడికి అభయాంజనేయస్వామి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ కొనుగోలు అమ్మకాల్లో ఈ నెల 25 నుంచి మార్పులు చేస్తూ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్తిబాబు, ఉపాధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరరావు, ముఖ్య సలహాదారుడు పర్వతనేని వెంకట రామారావు, సెక్రటరీ చెల్లబోయిన సింహాచలం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 5 నుండి 11 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం వరకు మార్కెట్ నిర్వహించే విధంగా మార్పులు చేస్తూ మార్కెట్ కమిటీ తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. ఈ మార్పును రాష్ట్ర నలుమూలల నుండి వస్తున్న వ్యాపారులు, రైతులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని వారు కోరారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎఎన్‌ఎంలకు ఇంక్రిమెంట్ల పత్రాల అందజేత

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట, ముక్కామల పిహెచ్‌సిలో సచివాలయ ఎఎన్ఎమ్‌లకు మంజూరైన ఇంక్రిమెంట్ పత్రాలను ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు బుధవారం అందజేశారు. పిహెచ్‌సివైద్యాధికారులు వి.గౌతమి,కె.ఎస్. శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సత్యనారాయణమూర్తి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.అప్పారావు, ఎఎన్ఎమ్‌లు, పిహెచ్‌సిల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని వనసపాడు శివారు మద్యం దుకాణం ఎదురుగా కాకినాడకు చెందిన స్కూల్ బస్, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు, ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. తిమ్మాపురం పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తొలగించారు. కేసు నమోదు చేశారు. సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంకి చెందిన దుర్గాప్రసాద్ బైక్‌పై కాకినాడ బయలుదేరాడు. తాళ్లరేవు బైపాస్ రోడ్డివాగ పేట సమీపంలో 216 జాతీయ రహదారిపై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి డివైడరను ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

32 మంది వ్యాపారులపై కేసులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

లీగల్ మెట్రాలజీ చట్టం 2009 నియమావళి ఉల్లంఘించిన 32 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశామనిఉప నియంత్రణ అధికారి ఎన్.జనార్ధనరావు, సహాయ నియంత్రణ అధికారి సలీం తెలిపారు. లీగలమెట్రాలజీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఉమ్మడి జిల్లాల్లో తొమ్మిది బందాలుగా ఏర్పడిన అధికారులు నిత్యావసరాలు అమ్మే షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తక్కువ తూకంతో రైస్ బస్తాలు అమ్ముతున్న వారిపై 10 కేసులు, ఎంఆర్‌పి కంటే అధికంగా అమ్ముతున్న వారిపై 2 కేసులు, తయారీదారుని చిరునామా ఇతర వివరాలు లేని వారిపై 20 కేసులు నమోదు చేశామని తెలిపారు. కాకినాడ, పిఠాపురం చిత్రాడ, కిర్లంపూడి, జగ్గంపేట, మండపేట, రాజోలు, మామిడికుదురు, తాటిపాక, పాసర్లపూడి, రాజమహేంద్రవరం, కొమరిపాలెం, బిక్కవోలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో సహాయ నియంత్రణ అధికారులు రాజేష్, సామ్యూల్ రాజు, ఇన్‌స్పెక్టర్లు సరోజిని, ప్రసాద్, బాలాజీ, కుటుంబరావు, నాగేంద్రకుమార్, మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.15 లక్షలకు టోకరా

ప్రజాశక్తి-గోకవరం

మొక్కజొన్న రైతులకు రూ.15 లక్షలకు టోకరా ఇచ్చిన ఘటన పెంటపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెంటపల్లికి చెందిన కోలపర్తి వీరవెంకటరావు ఈ ఏడాది 20ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. వీరవెంకటరావుతో పాటు 30 మంది రైతులు మొక్కజొన్న పంట వేశారు. వచ్చిన పంటను కొవ్వూరు గ్రామానికి చెందిన దుద్దుపూడి సూరిబాబుకి విక్రయించారు. వారిలో కొంతమందికి మాత్రమే సూరిబాబు డబ్బులు చెల్లించాడు. వీర వెంకటరావుతోపాటు 15 మందికి రూ.15 లక్షలు చెల్లించకుండా మోసం చేశాడు. వీర వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోకవరం ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేశారు.

లైంగిక దాడికి యత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి- అమలాపురం రూరల్

బాలికపై లైంగిక దాడికి యత్నం కేసులో నిందితునికి ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానాను న్యాయమూర్తి విధించారని అమలాపురం తాలూకా ఎస్ఐ ఎ.పరదేశి బుధవారం తెలిపారు. తాండవపల్లి గ్రామంలో గతేడాది మే 1న ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన గుత్తాల సువర్ణరాజు(40) లైంగిక దాడికి ప్రయత్నం చేశారు. ఈ మేరకు బాలిక అమ్మమ్మ అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిది. ఈ కేసును ఎస్‌పి పర్యవేక్షణలో అమలాపురం రూరల్ సిఐ పి.వీరబాబు నేతృత్వంలో ఎస్ఐ దర్యాప్తు చేశారు. నిందితుని అరెస్టు చేసి త్వరితగతిన చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో పోక్సో చట్టం కేసుల ప్రత్యేక జిల్లా కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాసరావు వాదించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్, పోలీసు సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లను ఎస్‌పి ఎస్.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించినారు.

500 మద్యం సీసాలు సీజ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించేందుకు ఒక ఇంట్లో దాచిన 500 మద్యం సీసాలను ఎస్ఇబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు ఉపయోగించే కారును సీజ్ చేశారు. ఒక వ్యక్తి అదుపులోకి తీసుకున్నారు. కొత్తపేట ఎస్ఇబి సిఐ మద్దాల శ్రీనివాస్‌కు బుధవారం అందిన సమాచారం మేరకు ఎస్ఇబి పోలీసులు, అమలాపురం టాస్క్ ఫోర్స్ పోలీసులు కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన కండవల్లి గనిరాజు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతనికి మద్యం సరఫరా చేసే, పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం చిన మల్లాం గ్రామానికి చెందిన గుడాల చంద్రశేఖర్‌స్వామికి చెందిన కారును, 500 యానాం మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సూర్యచంద్రకు పరామర్శ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

పితృవియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్రను జనసేన గండేపల్లి మండల అధ్యక్షులు గోన శివ, టిడిపి యువ నాయకులు సురేష్, బొల్లిన గంగాధర్ చౌదరి తదితరులు పరామర్శించారు. ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మణిపూర్ దమనకాండకు నిరసనగా శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్, పెద్దాపురం

మణిపూర్ రాష్ట్రంలో రెండు నెలలుగా క్రైస్తవులపై జరుగుతున్న దమన కాండను నిరసిస్తూ ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఎఐసిసి) ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాసరావుకు వినతి పత్రాలు అందించారు. మణిపూర్‌లో హింసకు పాల్పడుతూ వేలాదిమంది ప్రజల మరణానికి దారి తీసిన పరిస్థితులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి క్రైస్తవులకు భద్రత కల్పించాలని నినదించారు. ఈ సందర్భంగా ఎఐసిసి నాయకులు టి.జెస్సింగ్, ఆర్.లాజరస్, వి.జాన్, ఎం.ఎ.జేమ్స్, పి.ఆనంద్‌బాబు మాట్లాడారు. మణిపూర్‌లో అత్యంత దారుణంగా హింసించడం దారుణమన్నారు. చర్చిలను కూల్చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి శాంతియుత వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మడికి సోనియా, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎండివి.ప్రసాద్, సూర్యకుమార్, రూత్ ప్రశాంతి, షర్మిల, మాధవి, క్రైస్తవులు పాల్గొన్నారు. పెద్దాపురం గత రెండు నెలలుగా జరుగుతున్న క్రైస్తవులపై దాడులు, దౌర్జన్యాలు, మారణకాండలు, హత్యాకాండలకు నిరసనగా బుధవారం క్రైస్తవ సంఘాలు,ముస్లిం అంజుమన్ వెల్ఫేర్ అసోసియేషన్,షాహి జామియా మసీద్ కమిటీ ల ఆధ్వర్యంలో పెద్దాపురంలో శాంతి ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఆర్డీవో జె సీతారామారావుకు వినతి పత్రం అందజేశారు.



సామర్లకోటలో....



పెద్దాపురంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఒడిగోస్‌కు ఐఎస్ఓ గుర్తింపు

ప్రజాశక్తి - కాకినాడ

రమణయ్యపేట 3వ ఎపిఎస్‌పి వద్ద విజెఎస్‌ఎంఆర్ ఒడిగోస్‌కు ఐఎస్ఓ గుర్తింపు వచ్చిందని ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్ట్‌నర్ వార వినోద్ తెలిపారు. ఒడిగోస్ కార్యాలయంలో బుధవారం అభినందన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి విజెఎస్‌ఎంఆర్ ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్ట్‌నర్ వార వినోద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు, పోస్టల్ యూనియన్ నాయకులు వారా సత్యనారాయణ, జిమ్ విల్సన్, అర్జున్ పాల్గొన్నారు. సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన తర్ఫీదునివ్వడానికి కషి చేస్తున్న విజెఎస్‌ఎంఆర్ ఒడిగోస్‌కు ఐఎస్ఓ గుర్తింపు హర్షణీయమన్నారు. పోస్టల్ యూనియన్ నాయకులు వి.సత్య నారాయణ మాట్లాడుతూ నిరుద్యోగంతో బాధపడుతూ ఉపాధి అవకాశాలకోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఒడిగోస్ సేవలను వినియోగించు కోవాలన్నారు. జాంగా గగారిన్, మచ్చ బుజ్జి తదితరులు ఒడిగోస్ కు అభినందనలు తెలిపారు.


గుర్తింపు పత్రాన్ని చూపుతున్న వినోద్ తదితరులు

మహిళలపై పెరుగుతున్న దాడులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వైసిపి ప్రభుత్వంలో మహిళలు, యువతులపై నిత్యం అత్యాచారాలు, దాడులు, హత్యాయత్నాలు జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. రేపూరులో బుధవారం భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైసిపి పాలనలో మహిళా సాధికారత పూర్తిగా కుంటుపడిందన్నారు. భారతీరెడ్డిపై ఎవరో ఏదో పోస్టు పెడితే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన వాసిరెడ్డి పద్మ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వైసిపి పెటిఎం కుక్కలతో పెట్టించే పోస్టుల పట్ల పోలీసులు ఎందుకు స్పందించట్లేదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిదే నాగ హరినాథ్, ఎంపిటి మాజీ సభ్యులు పెండెం కృష్ణ, పార్టీ అధ్యక్షులు పెండెం శ్యామ్ గణేష్, పెండం గణేష్, ముద్రగడ స్వామి, కళ్యాణం అంజిబాబు, పలివెల గాయత్రి, గంటా రమణ, కాదా చిన్న పాల్గొన్నారు.

21న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాజులూరు

లైన్ల మరమ్మతులు, ట్రీకటింగ్ నేపథ్యంలో ఈ నెల 21న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆర్యావటం సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈ వివరాలు వెల్లడించారు. 33/11 కెవి గొల్లపాలెం సబ్ స్టేషన్ 11కెవి అంద్రంగి ఫీడర్ పరిధిలోని పెద్దాపురప్పాడు, యండమూరు, విజయరాయుడుపాలెం, జగన్నాథగిరి, పెనుమల్ల, తనుమల్ల, అంద్రంగి, పెదపాటి గరువు, కుయ్యేరు సబ్‌స్టేషన్ పరిధిలో దుగ్గుదూరు, మేకలగరువు, రేగుబడవ, చింతల్లంక, కుయ్యేరు ఏరియాలో ఇండస్ట్రియల్ ఫీడర్‌లో ఇండస్ట్రీలు, ఆక్వా కల్చర్‌కు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలన్నారు.

టిడ్కో ఇళ్ల సముదాయం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వాలు తిమ్మాపురం రహదారిలోని టిడ్కో గృహ సముదాయాన్ని బుధవారం టిడ్కో, విద్యుత్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. కాలనీలో సమస్యలు పరిశీలించారు. టిడ్కో కాలనీలో సరైన సదుపాయాలు లేక, తాగునీరు కూడా సక్రమంగా సరఫరా కాక ప్రజలు పడుతున్న అవస్థలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 14న మున్సిపల్ కమిషనర్ సురేంద్రకు వినతి పత్రం అందజేశారు. దీనిపై వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆదేశాలు మేరకు టిడ్కో డిఇ, ఎఇ సుధీర్, విద్యుత్ శాఖ ఎఇ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణజీవప్రసాద్ ఆధ్వర్యంలో టిడ్కో కాలనీలో సమస్యలు పరిశీలించారు. గుర్తించిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆరేళ్ల వీర రాఘవ, విడదాసరి రాజా, కౌన్సిల్ కో- ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

యుడిసి రాత పరీక్షకు 8 సెంటర్ల కేటాయింపు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పాలన సంస్కరణల విభాగం ఈ నెల 23న యానాంలో నిర్వహించనున్న అప్పర్ డివిజినల్ క్లర్క్-2023 రాత పరీక్షకు సంబంధించి ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. యానాం ప్రాంతానికి చెందిన 2,122 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారన్నారు. తాను రీజనల్ కో-ఆర్డినేటర్‌గా, మరో ఇద్దరు ఆర్ముగం, గణేషన్ జోనల్ సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారన్నారు. రీజెన్సీ పబ్లిక్ స్కూల్, రీజెన్సీ జూనియర్ కళాశాల, పిజెఎన్ గవర్నమెంట్ హై స్కూల్ మెట్టకూరు, నవోదయ విద్యాలయ జోనల్ సూపర్‌వైజర్ ఆర్ముగం పర్యవేక్షణలో ఉంటాయన్నారు. ఎంజిజి హై స్కూల్, రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, ఎస్‌టిపి జూనియర్ కళాశాల, శ్రీసాయిజూనియర్ కళాశాల జోనల్ సూపర్‌వైజర్ గణేషన్ పర్యవేక్షణలో ఉంటాయన్నారు. ఈనెల 23 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. అభ్యర్థులు 8:30లోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు ఈ పరీక్షకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని ఎలిపారు.


సమావేశానికి హాజరైన బిఎల్ఒలు

21 నుంచి ఓటర్ల సర్వే

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఎన్నికల శాఖ ఆదేశాల మేరకు యానాం నియోజకవర్గంలో ఫోటో ఎలక్టోరల్ రోల్స్-2024 సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు సర్వే నిర్వహిస్తారని ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. నూతన ఓటర్ల నమోదు, ఫోటో, పేరు మార్పు, చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటివి చేస్తారన్నారు. చిరునామా మార్పులు కూడా చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. బిఎల్ఒలు కచ్చితమైన సమాచారంతో ఈ సర్వే చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక సర్వ శిక్ష అభియాన్ సమావేశ మందిరంలో బూత్ లెవెల్ ఆఫీసర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ నిర్వహించారు.

లోవరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా లంక చినలోవరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతం ఆర్ఎఒ మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువాతో సత్కరించారు. వివిధ శాఖల ఉద్యోగులు లోవరాజుకు అభినందనలు తెలిపారు.

మెట్ట రైతులకు సాగు నీరు అందించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

పుష్కర ఎత్తిపోతల పథకానికి సంబంధించి తాళ్లూరు లిఫ్ట్‌లో ఉన్న లోపాలను వెంటనే సరిచేసి మెట్ట రైతులకు నీరందించాలని మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ కింద సుమారు 63 వేల ఎకరాలు సాగవుతున్నాయన్నారు. నాలుగేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో నీటి సరఫరా సరిగా జరగట్లేదన్నారు. గతంలో బిల్లులు చెల్లించకపోవడంతో మెయింటినెన్స్‌కు కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదన్నారు. మరమ్మతులుకు రూ.30 లక్షల వరకూ అవుతుదంన్నారు. సిఎస్ఆర్ నిధులతో వెంటనే మరమ్మతులు నిర్వహించలన్నారు. లేకుంటే కలెక్టరేట్ వద్ద రైతులతో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మారిశెట్టి భద్రం, నాయకులు కొత్త కొండబాబు, రేఖ బుల్లిరాజు, రేఖ వేణు తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ


బిఎల్ఒల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సత్యనారాయణ

ఓటర్ల జాబితా పరిశీలనకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కాకినాడరూరల్, పిఠాపురం

ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి ఓటర్ల జాబితా పరిశీలనకు సంబంధించి బిఎల్ఒలు సిద్ధం కావాలని ఆర్‌డిఒ ఎస్‌వివి.సత్యనారాయణ అన్నారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ మురార్జీ ఆధ్వర్యంలో బిఎల్ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో కరప తహవుల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో బిఎల్ఒలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నియోకవర్గ ఓటర్ల నమోదు అధికరి కె.సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. బిఎల్ఒలు ప్రతి ఇంటికీ వెళ్ళి రోజువారీ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, కమిషనర్, డిటిలు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలపై సమీక్ష

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

టిడ్కో లబ్ధిదారుల సమస్యలపై మెప్మా పీడీ బి.ప్రియంవద బుధవారం సమీక్ష చేశారు. మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ జాస్తి రామారావుతో కలిసి ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ చనిపోయిన వారి స్థానంలో టిడ్కో ఇళ్ళను వారి కుటుంబ సభ్యులకు కేటాయించాలన్నారు. ఆసక్తి లేనివారి నుంచి లెటర్లు తీసుకోవాలన్నారు. బ్యాంక్ రుణాల సమస్యలపై సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రిమార్కులు ఉన్న లబ్దిదారులను గుర్తించి సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకు రుణాల్లో సిబిల్ సమస్యలు, ఎక్కువ వయస్సు గల వారితో నేరుగా పేమెంట్లు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామారావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ బిఎల్.జ్యోతి, మున్సిపాల్టీ పరిధిలో సిఒలు, ఆర్‌పిలు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు అందించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

గర్భిణులకు, శిశువులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. ద్రాక్షారామ పిహెచ్‌సి పరిధిలో గల హసనబాద, తాళ్లపొలం సచివాలయా లను ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. సచివాలయం పరిదిలో అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఆరోగ్య సేవలకు సంబంధించి రికార్డ్స్, ఆన్లైన్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇ ఒ.రామకష్ణ , రవికుమార్, వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పెన్షనర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని ఆలిండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు గాలిబు పేర్కొన్నారు. బుధవారం అసోసియేషన్ 10వ వార్షికోత్సవం కాకినాడలోని తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రధాన హెడ్ పోస్ట్ మాస్టర్ టి.అమ్మిరాజు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించడంలో నాయకుల ఆవశ్యకత ఎంతైనా ఉంటుందని, సమిష్టి కృషితోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెన్షనర్ల కు రావాల్సిన వాటిని పొందేల కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎపిఎఫ్ నాయకులు సాగర్, కె.ప్రసాద్‌రావు, కె.శ్రీనివాసరావు, డివిజనల్ కార్యదర్శి తురగ సూర్యారావు, సిహెచ్.రామారావు, లక్ష్మీనారాయణ, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక బంగారమ్మ గుడి వీధిలో మరిడమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంబరంలో ప్రదర్శించిన విద్యుత్ దీపాలంకరణ మధ్య బండ్ల వేషాలు యాత్రికులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. గరగల నత్యాలు, కాళికా వేషాలు, కర్ర సాములు, జానపద కళారూపాలు అందర్నీ అలరించాయి. సుబ్బయ్య పేట, శంకరయ్య పేట, చల్లా వారి వీధి, బంగారమ్మ గుడి వీధి, సినిమా సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా కొనసాగిన ఈ సంబరంలో ఎస్ఐ వి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. వర్షానికి వ్యాపారులు, కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండపేట-ద్వారపూడి, మండపేట రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలిచిపోయిన తాపేశ్వరం రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి తమకు ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా వర్షాలతో మండలంలో వరినాట్లు వేగవంతమ య్యాయి. దమ్ములు, వరినాట్ల పనులను రైతులు ముమ్మరం చేశారు. ఏడిద, వెలగతోడు, తాపేశ్వరం, పాలతోడు తదితర గ్రామాల్లో వరినాట్లు వేశారు. మిగిలిన గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమ య్యారు. మండపేట మండలంలో ఇప్పటి వరకు 75 శాతం నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నా... నెలాఖారు వరకూ వరినాట్లు పడే అవకాశం ఉంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు బుధవారం ఆయన మండలంలోని వద్దిపర్రు గ్రామంలో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు సమస్యలపై పోరాడేందుకే అవకాశం లేకుండా ఈ ప్రభుత్వం గడప వద్దకే వచ్చి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ సేవలు అందిస్తోందన్నారు.

7.5 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

ప్రజాశక్తి - అంబాజీపేట

బిల్లులు సక్రమంగా లేకపోవడంతో రూ.2.50 లక్షల విలువ చేసే 7.550 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామని ఇన్‌ఛార్జి రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుఆర్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం మాచవరంలోని శ్రీ సుభూషన్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లలో ఉన్న వివరాలకు, స్టాకు మధ్య వ్యత్యాసం ఉండడం, రైతులకు బిల్లులు ఇవ్వడంలో విఫలమైనందున యజమానిపై 6ఎ కేసు నమోదు చేశారు. రూ. 2,50,850 విలువ గల 7.550 మెట్రిక్ టన్నుల డిఎపిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలో మూడు జిల్లాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసినా, నకిలీ విత్తనాలు అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సత్య కిషోర్, ఎఒ భార్గవ్ మహేష్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు